ప్రజాశక్తి

మంగళవారం 20 మే 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఒంగోలులో వర్షపునీరు నిల్వ చేరకుండా ఉండేందుకు వర్షంలోనూ పనులు చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

జోరు వాన

- అకాల వర్షాలకు తడిసిన పంటలు
- ఆందోళనకు చెందుతున్న రైతులు
- నష్టాల బాటలో రైతన్నలు

మిర్చిపై పట్టలు కప్పిన రైతులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, నాగులుప్పలపాడు

తుపాన్ ప్రభావంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి జిల్లాలో వాన జోరుగా కురుస్తోంది. కొన్ని చోట్ల సోమవారం ఉదయం వరకు వర్షం కురవగా.. మరికొన్న చోట్ల మధ్యాహ్నం వరకు కొనసాగింది. వర్షాలు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఒంగోలు, ప్రకాశం భవనంలో 1077 టోల్ ఫ్రీ నెంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమును ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు.

వర్షాల కారణంగా నాగులుప్పలపాడు మండలంలో పందిర్లపై ఉన్న ▶ 2లో

ఆలయంలో మంత్రి గొట్టిపాటి

వైభవంగా మహా కుంభాభిషేకం

హాజరైన మంత్రులు గొట్టిపాటి, స్వామి

▶ 6లో

'సుందరయ్య' ఉద్యమస్ఫూర్తితో ముందుకు..

సిపిఎం ఆధ్వర్యంలో నివాళి 5వ పేజీ

ప్రభుత్వ రంగ సంస్థల పాత్రేదీ.?

- పంటల కొనుగోలుకు ముందుకు రాని వైనం..
- సమాఖ్య, డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్, ఎస్టీసీలు ఎక్కడ.?
- పదవుల కోసమే ఆ సంస్థలు తప్ప రైతులపై దృష్టి శూన్యం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వ్యాపారులు మార్కెట్‌లో సంక్షోభం సృష్టించినప్పుడు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు గానీ, వారిని ఆదుకునేందుకు గానీ ప్రభుత్వం అనేక సంస్థలను ఏర్పాటు చేసింది. రైతులకు కష్టకాలాల్లో అవి ఏదోరకంగా ఆదుకోవాలి. గతంలో కొన్ని సందర్భాల్లో రైతులకు మేలు చేశాయి. అయితే ఇప్పుడు వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రైతులకు మేలు చేసే ప్రసక్తే కనిపించడం లేదు. పాలక పక్ష నేతలకు పదవులను కల్పించే సంస్థలుగా మారాయి. కార్యకలాపాలు కనిపించడం లేదు. ప్రస్తుతం వర్జీనియా, బర్లీ పొగాకు రైతులు రోడ్డున పడ్డారు. వేలం కేంద్రాల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారారు. రైతులకు ధరలు ఇవ్వడం లేదు. మరో వైపు బర్లీ పొగాకు కొనే నాథుడే కనిపించడం లేదు. ఈ తరుణంలో వేలం కేంద్రాల్లో ప్రభుత్వ రంగ సంస్థలను దించి పోటీ పెంచాలని రైతులు కోరుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. శనగలు, మిర్చి, పత్తి.. వంటి పంటలకు ఇప్పుడు గిట్టుబాటు ధరల్లేవు. ధాన్యం కూడా తక్కువ ధరలకే అమ్మేసుకున్నారు. అయితే పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య, డీసీఎంఎస్, ఎస్టీసీ, మార్క్‌ఫెడ్, మార్కెట్ కమిటీలు ఇప్పుడు ఎందుకు ఉన్నట్లు? రైతులకు ఏం చేస్తున్నాయనే ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవలే డీసీఎంఎస్‌కు ఛైర్మన్‌ను ప్రకటించారు. పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్యకూ ప్రకటించే యోచనలో ఉన్నారు. ఈ రెండు సంస్థలు మార్కెట్‌లో పాత్ర లేకుండా పోయాయి. సమాఖ్య గతంలో పొగాకు కొనుగోలు చేసింది. పోటీ పెరగడం వల్ల రైతులకు మేలు జరిగింది. ఇప్పుడూ రైతులు ఇదే ▶ 3లో

25 వేల మెట్రిక్ టన్నుల

ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఆమోదం

కలెక్టర్ వెంకట మురళి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులకు మద్దతు ధర కల్పించడంలో భాగంగా 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఆమోదించిందని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశమయ్యారు. వర్చువల్ విధానం ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులతోనూ ఆయన సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణలో బాపట్ల జిల్లాలో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 30 వేల మెట్రిక్ ▶ 2లో

ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించాలని జిల్లాకు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. బయట మార్కెట్లో ధాన్యం ధరలు తగ్గడం, అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు నష్టపోతున్నారని ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లామన్నారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా ధాన్యం పంట సాగుతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యం పెంచేలా అనుమతులు ఇవ్వాలని పలుమార్లు కోరినట్లు చెప్పారు. స్పందించిన ప్రభుత్వం తాజాగా 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు ఇచ్చిందన్నారు. తాజా అనుమతులతో జిల్లాలో మొత్తంగా 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ధాన్యం సేకరణ వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పి-ఫోర్ విధానంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శిలను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలని ఎంపీడీవోలను కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శిలు అందించే సహాయం ఎలా చేరవేయాలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీటి తీరువా వసూలు జిల్లాలో రూ.19 కోట్లు లక్ష్యం కాగా.. గడిచిన పది రోజుల్లో రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రూ.75 లక్షలు, బాపట్ల డివిజన్‌లో రూ.27 లక్షలు, చీరాల డివిజన్‌లో రూ.11 లక్షలు సొమ్మును వసూలు చేశామన్నారు. మిగిలినవి లక్ష్యం మేరకు వసూలు చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద పట్టణాలలో 2,500 యూనిట్లను స్థాపించాలని మున్సిపల్ కమిషనర్లకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో సూర్య ఘర్ యూనిట్ల స్థాపన ప్రతి ఎంపీడీవోకి 1500 యూనిట్లను లక్ష్యంగా ఇచ్చామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు చేరుకోగలమన్నారు. రీసర్వే ప్రక్రియ క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా ఆర్డీవోలు, తహశీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గహ నిర్మాణ లక్ష్యాలు వేగంగా పూర్తయ్యేందుకు పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం ఉండరాదన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జోరు వాన

(మొదటిపేజీ తరువాయి)

పొగాకు కళ్లాల్లో మిర్చి తడిసిపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఆ పంటలను కాపాడుకోవడానికి నానా అగచాట్లు పడ్డారు. అయినా ఫలితం లేకుండా పోయింది. పొగాకు తడిసి ముద్దయింది. మిర్చి రాసులకు పట్టలు కప్పినా.. నెమ్ము అని రంగు మారుతుందేమోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఉప్పుగుండూరుకు చెందిన కౌలు రైతు గోగినేని రవిచంద్రకు చేతికి వచ్చిన మిర్చి పంటను గోతాలకు ఎత్తుదామని కళ్లాల్లో ఉంచారు. దీంతో అర్ధరాత్రి ఒక్కసారిగా వర్షం రావడంతో పంటను కాపాడుకోవడానికి పరుగులు తీశాడు. ఎట్టకేలకు పట్టలు కప్పారు. అయినప్పటికీ భారీగా వర్షం పడటంతో నీళ్లు పారి నెమ్ము తగిలి రంగు మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. పందిర్లలో ఉన్న పొగాకు చెక్కుల కిందకు నీరుపారి అవి తడిసిపోయాయని తెలిపారు.

రెండు రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో పడిన వర్షానికి ఒకసారి పొగాకు తడిసి పోయింది. మరలా పడటంతో పూర్తిగా తడిసి నల్లగా మారుతుందని పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పుగుండూరుకు చెందిన గోగినేని ప్రతాప్ 150 క్వింటాళ్లు పందిర్లపై ఉందని వర్షానికి రంగు మారుతుందేమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొలి నుండి ఒడిదుడుకులు ఎదుర్కొని పంటలు సాగు చేశారు. దీంతో పెట్టుబడులు ఘననీయంగా పెరిగాయి.. దిగుబడులు తగ్గాయి.. ధరలు దిగజారాయి. తద్వారా నష్టాల బాట పట్టారు. ఈ నేపథ్యంలో ప్రయివేట్ కంపెనీలు ప్రోత్సహించి.. తీరా పంట చేతికి వచ్చిన తరువాత నాణ్యత లేదని కుంటుసాకులు చెప్పడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత సంవత్సరం పొగాకు రేట్లు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో బర్లీ పొగాకు సాగు చేశారు. మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల వరకు బర్లీ పొగాకు సాగు చేశారు. ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టారు. దిగుబడి 10 క్వింటాళ్లకు మించి రాలేదు. సరాసరిన తెల్లబర్లీ, నల్లబర్లీ.. క్వింటా రూ.పది వేలకు మించి కొనుగోలు చేయడం లేదు దాంతో ఎకరానికి 50 వేల వరకు బర్లీ పొగాకు రైతులు నష్టపోతున్నారు. మిర్చి 4,500 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి 2 లక్షల దాకా పెట్టుబడి పెట్టారు. దిగుబడి 10 నుండి 12 క్వింటాళ్లకు మించి రాలేదు. గత సంవత్సరం రూ.20 వేల పలికిన ధర ఈ ఏడాది 9 వేలకు మించి రాలేదు. దీంతో ఎకరానికి సుమారు రూ.లక్ష వరకు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని, లేనిచో వ్యవసాయం చేసే పరిస్థితి లేదని రైతులంటున్నారు.

ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ప్రజలకు అవసరమైన సహాయం చేసేందుకు జిల్లాస్థాయిలో ప్రకాశం భవనంలో 1077 టోల్ ఫ్రీ నెంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమును ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ నెల 19 సాయంత్రం నుంచి 23 వరకు ఈ కేంద్రం నిరంతరాయంగా పనిచేస్తుంద న్నారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సిబ్బందిని ప్రత్యేకంగా కలెక్టర్ కేటాయించారు. ప్రతి 12 గంటలకు ఒక టీము పనిచేసేలా రెండు బృందా లను ఆయా శాఖల సిబ్బందితో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, భారత వాతావరణ శాఖలు చేసిన ముందస్తు హెచ్చరికల నేపథ్యం లో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షిం చేందుకు ఈ కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టోల్‌ఫ్రీ నెంబరుకు వచ్చే ఫోన్ కాల్స్‌ను రిసీవ్ చేసుకుని ఆ వివరాలను సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి.. సమన్వయంతో తక్షణమే స్పందించేలా ఇందులోని సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా మండల, డివిజన్ స్థాయి అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిర్దేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, మండల, డివిజన్‌ల స్థాయిలోను కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు.

CHANGE OF NAME

I, **Smt DAGGUPATI SAPSWATHI** legally mother of No **2621881F,** Rank:SEP **DAGGUPATI SANJEEVA MURALI,** Unit 12 MADRAS REGT, Presently residing at Village-Sarvireddypalli, Post-Komarolu, Mandal - Komarolu, District - Prakasam, Andhra Pradesh I have changed my name from **DAGGUPATI SAPSWATHI** to **DAGGUPATI SARASWATHI,** Vide affidavit dated 19.05.2025.

CPC u/or 21, Rule 54 (A) నోటీసు

మహారాజు శ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P No : 17/2025

in

O.S No : 262/2022

Between:-

ముప్వల వెంకటేశ్వర్లు .....DHR

V/s

ముప్వల సుబ్రమణ్యం ....JDR

To,

ముప్వల సుబ్రమణ్యం, S/o ఆంజనేయులు

DOOR NO:- 12-31, పర్చూరు (V)

(Parchur DMC)

పై నెంబరు అమలు దావాలోని DHR, Decree బాకీ వసూలు నిమిత్తం అమలు దావా దాఖలు చేసి CPC u/or 21, Rule 54 (A) నోటీసులు మీకు ఎన్నిసార్లు పంపిననూ, జారీ కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ,పై నెంబరు అమలు దావా మీ హాజరు నిమిత్తం ది: 25-06-2025 నకు వాయిదా అయిఉన్నది. కావున పైన ఉదహరించిన మీరు పై కోర్టు నందు ది :25-06-2025 న ఉదయం గం 10:30 ని.లకు హాజరు అయి మీ వాదనను దాఖలు చేసుకొనని ఎడల మీ పరోక్షమున తీర్మానము జరుగునని ఇందుమూలంగా తెలియ పరచడమైనది.

వాయిదా : 25-06-2025

ఇట్లు

కొల్లా నరేంద్ర కుమార్

DHR తరపు న్యాయవాది

పర్చూరు

Cell No : 9440638201

కోర్టు వారి ఉత్తర్వు మేరకు పత్రికా ప్రకటన

ప్రిన్సిపలు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్ ఒంగోలులో

E.P No. 283/2023

Between

తడికమళ్ళ వెంకట సుశీల ..... డిహెచ్ఆర్

And

మోటపోతుల వెంకటేశ్వర్లు ... జెడిఆర్

To

JDR)

మోటపోతుల వెంకటేశ్వర్లు

S/o వెంకటాచలపతి

వయస్సు 49 సంవత్సరాలు, వ్యాపారం

డోర్ నెం. 6-127, 100 అడుగుల రోడ్,

వెంకటేశ్వర కాలనీ,ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా,

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పై ఇపి లో జెడిఆర్ అయిన మీకు పైఇపి నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ జారీ కానందున మీకు నోటీసు మరియు మీ హాజరు నిమిత్తమై పై కోర్టు వారు తే.30-06-2025 దికి పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు కొరకు ఆర్డరు వేసియున్నారు. కావున తే.30-06-2025దిన మీరు స్వయంగా గాని మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టులో హాజరుపడి పై ఇపి విషయమై మీ ఆక్షేపణలు ఏవైనా ఉన్నయడల తెలియజేసుకొనగలరు. లేనియడల పై కోర్టువారు పై ఇపిని మీ పరోక్షములో విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేది : 30-06-2025

ఉదయం 10.30 గంటలకు.

ఇట్లు

విరిగినేని నరసింహారావు

జాజుల మాధురి,

కొమ్మాలపాటి ప్రమీలారాణి

Ch. బాబు రావు,

S. మమత,

P. వెంగళ రావు

పిటిషనరు తరపు న్యాయవాదులు,

Cell No : 9440077226

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 22/2025

Between :-

మానం హరిబాబు .... వాది

V/s

ముప్వల సుబ్రమణ్యం ...... ప్రతివాది

To,

ముప్వల సుబ్రమణ్యం

S/o ఆంజనేయులు

Door No : 12-31, పర్చూరు

(Pachur DMC)

పై నెంబరు దావాలోని వాది, మీపై ప్రోనోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం దావా దాఖలు చేసి, మీకు దావా సమన్లు ఎన్నిసార్లు పంపిననూ జారీ కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము పై నెంబరు దావా మీ హాజరు నిమిత్తం ది:27-06-2025 నకు వాయిదా అయిఉన్నది. కావున పైన ఉదాహరించిన మీరు పైకోర్టునందు ది.27-06-2025 న ఉదయం గం. 10:30. ని.లకు హాజరై మీ వాదనను దాఖలు చేసుకొనని యెడల మీ పరోక్షమున తీర్మానము జరుగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

వాయిదా :27-06-2025

ఇట్లు

కొల్లా నరేంద్ర కుమార్

వాది తరపు న్యాయవాది

పర్చూరు

Cell No : 9440638201

IN THE COURT OF THE
VII ADDL. DISTRICT JUDGE ELURU.
FAMILY COURT. ELURU, ELURU Dist.

I.A.480/2025, O.S.99/2018

Between :

Nimmagadda Murali Kumari @
Cilukuri Murali Kumari
...Petitioner/Plaintiff

And

Nimmagadda Premachodary
& Others ... Respondents/Defendants

పై నెంబరు దావా గ్రంథంలో వాది నిమ్మగడ్డ మురళీ కుమారి గారు అను వారు పిటిషనరు. Tummala Charla Ramadevi ని అవ్వారు హానికా వర్షిణి మైనరు తరపున గార్డియన్‌గా నియమించు నిమిత్తం I.A.480/2025 అనే పిటిషను దాఖలు చేసియున్నారు. 3వ రెస్పాండెంటు తరపున గార్డియన్ యొక్క చిరునామా Avvaru Hanika Varshini being minor Tummala charla Ramadevi, W/o.Subba rao, R/o.D.No. 12-8-16, Mutyalapeta. perala. Cheerala, Prakasam Dist. అనువార్కి తమ కోర్టు వారి ద్వారా నోటీసు పంపియున్నను. తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు 3వ రెస్పాండెంటుకు పేపరు ద్వారా నోటీసులు అమలు జరుపుటకు కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. సదరు 3వ రెస్పాండెంటు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల ది.19.6.2025వ తేదీన ఉ॥10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరయి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు పిటిషను గ్రంథంలో మీ పరోక్షమందు విచారించబడును.

Y.Nirmala Devi

Eluru Advocate, Eluru.

Dt.15-5-25 పిటిషనరు తరపు ప్లీడరు.

IN THE COURT OF THE
VII ADDL. DISTRICT JUDGE ELURU.
FAMILY COURT. ELURU, ELURU Dist.

I.A.473/2025, O.S.99/2018

Between :

Nimmagadda Murali Kumari @
Cilukuri Murali Kumari
...Petitioner/Plaintiff

And

Nimmagadda Premachodary
& Others ... Respondents/Defendants

పై నెంబరు దావా గ్రంథంలో I.A.473/2025 వాది నిమ్మగడ్డ మురళీ కుమారి గారు పిటిషనరు. Under or 1 Rule 10 పిటిషను కోర్టులో దాఖలు చేసియున్నారు. 3వ రెస్పాండెంటు Proposed Party అయిన అవ్వారు హానికా వర్షిణి మైనరు తరపున Tummala charla Ramadevi, ని Property Guardian గారికి కోర్టు ద్వారా నోటీసులు పంపియున్నను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు 3వ రెస్పాండెంటు Tummala Charla Ramadevi, W/o.Subba rao, R/o.D.No. 12-8-16, Mutyalapeta. perala. Cheerala, Prakasam Dist. అనువార్కి పేపరు ద్వారా నోటీసులు అమలు జరుపుటకు ఆర్డరు వేసినారు. సదరు రెస్పాండెంటు గారికి దావా గ్రంథంలో పిటిషనులో ఏమైన ఆక్షేపణలు వున్న యెడల ది.19-6-2025వ తేదీన ఉ.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరయి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల దావా గ్రంథంలో పిటిషను మీ పరోక్షమందు విచారించబడును.

Y.Nirmala Devi

Eluru Advocate, Eluru.

Dt.15-5-25 పిటిషనరు తరపు ప్లీడరు.

గ్రామపంచాయితీ కార్యాలయం,చందలూరు

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి నెం: 01/టెండర్స్/2025 **తేది:15-05-2025**

ప్రకాశం జిల్లా దర్శి మండలం చందలూరు గ్రామపంచాయితీకి FY2025-2026 సంవత్సరమునకు టెండర్ పద్దతి పై ఈక్రింద తెలియజేసిన సామాన్లు సప్లయ్ చేయుటకు సీలు వేసిన టెండర్లు తేది:29-05-2025 ఉదయంగం 10.00 నుండి మధ్యాహ్నం 2.00 గం.వరకు స్వీకరించబడును అదే రోజు మధ్యాహ్నం 3.00లకు హాజరైన టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరవబడును.టెండరు దారులు టెండర్ దరావత్తు రు.200/-చెల్లించి, దరావత్తు చెల్లించి షెడ్యూల్స్ తీసుకొనవలెను సకాలంలో రాని టెండర్లు దరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు, మిగతా వినరముల కొరకు ఆఫీసు పనిసమయములో తెలుసు కొనవలెను

వ.నెం పని వివరము	చెల్లించవలసిన ధరావత్తు
1. 2025-2026 సంవత్సరమునకుగ్రామపంచాయితీకి అవసరమగు ఎలక్ట్రికల్ సామానులు సరఫరా చేయుట	రూ.2000/-లు
2. 2025-2026సంవత్సరమునకుగ్రామపంచాయితీకి అవసరమగు ప్రజారోగ్య సామానులు సరఫరా చేయుట	రూ.2000/-లు
3. 2025-2026సంవత్సరమునకు గ్రామపంచాయితీకి అవసరమగు స్టేషనరీ సామానులు సరఫరా చేయుట	రూ.2000/-లు
4. 2025-2026 సంవత్సరమునకుగ్రామపంచాయితీకి అవసరమగు PWS SCHEME సామానులు సరఫరా చేయుట	రూ.2000/-లు

షరతులు :-

1. ఏ కారణం చేతనైనా టెండర్లు రద్దు పరచుటకు అమలు పరచుటకు పంచాయితీ కార్యదర్శి గారికి పూర్తి అధికారము కలదు.
2. పంచాయితీలో నిధుల సౌలభ్యమును బట్టి డబ్బు పేమెంట్ చేయబడును. డబ్బు పేమెంట్‌లో జరుపు జాప్యమునకు పంచాయితీ ఎటువంటి వడ్డీ చెల్లించదు. ఎట్టి డిమాండ్ చేయరాదు.
3. ఎట్టి కారణములు చూపకయే టెండరు వాయిదా వేయుటకు గాని, లేదా రద్దు పరచుటకు గానీ, పంచాయితీ కార్యదర్శి గారికి పూర్తి అధికారం కలదు.
4. ఆడిట్ అనంతరము ధరావత్తులు వాపస్ చేయబడును.
5. సప్లయ్ చేయబడిన వస్తువుల నాణ్యతలో లోపమునకు టెండరు దారుడు బాధ్యత వహించవలెను.

సం/-

పంచాయితీ కార్యదర్శి,

గ్రామపంచాయితీ, చందలూరు

పైసలిస్తేనే మస్టరు..!

రూ.2 వందల నుంచి రూ.3 వందలు వసూలు

అడిగితే అధికారులకు ఇవ్వాలని సమాధానం

ఉపాధి పనుల్లో అవినీతి దందా

ప్రజాశక్తి-మద్దిపాడు

కరువు సమయాల్లో ఆసరాగా ఉంటున్న ఉపాధి హామీ పథకం నీరుగారిపోతుంది.. ఒక్కో కూలీ వద్ద ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. వారానికి రూ.200 నుంచి 300 ఇస్తే పనికి వచ్చినా... రాకపోయినా... కూలి డబ్బులు ఎక్కువ పడతాయి. డబ్బులు ఇవ్వకపోతే కొలతలు ప్రకారం పని చేసినా పనికి తగ్గ డబ్బులు పడవు. ప్రస్తుతం మద్దిపాడు మండలంలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతి దందా ఇది.

మద్దిపాడు మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. మండలం మొత్తం మీద 9505 మంది జాబ్ కార్డులు కలిగి ఉండగా అందులో ప్రతి రోజు 6660 మంది మాత్రమే హాజం వుతున్నారు. పనికి వచ్చిన ఒక్కో కూలీ వద్ద నుంచి వారానికి రూ.200లు నుంచి 300 వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. వారం వారం డబ్బులు ఇచ్చిన కూలీలకు ఎక్కువ డబ్బులు వచ్చేలా మస్టర్‌లో హాజరు వేస్తున్నారు. ఇవ్వని వారికి మస్టర్‌లో తక్కువ డబ్బులు వచ్చేలా హాజరు వేస్తారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్ ఫొటో)

అదే క్రమంలో వారు పని సరిగ్గా చేయడం లేదంటూ కసురుకుంటున్నారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్‌ల ద్వారా ప్రతి వారం కూలీల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి అధికారులకు అప్పజెబుతున్నారని కూలీలు స్వయంగా చెబుతున్నారు. కొద్ది రోజుల కిందట ఓ గ్రామంలో డబ్బులు ఇవ్వలేదని ఎస్‌సిలకు మూడు వారాలకు పైగా పని చూపించలేదు. మొదటి వారం వారిని ఎందుకు ఆపుతున్నారో అర్థం కాలేదు. తర్వాత మిగతా వారికి పనులు పెట్టి తమను మాత్రమే పనికి ఆపుతున్నారని తెలుసుకుని ముక్కున వేలేసుకున్నారు. పని కల్పించే ప్రదేశం కోసం వెతుకులాడుతున్నామని సదరు ఫీల్డ్ అసిసెంట్లు చెబుతు న్నారని ఆ గ్రామానికి చెందిన కూలీలు చెబుతున్నారు. అదే విధంగా పనికి వెళ్లకున్నా.. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి పేర్ల మీద మస్టర్లు వేసి అకౌంట్లలో డబ్బులు పడి న తరువాత సదరు వ్యక్తికి ఎంతో కొంత ఇచ్చి మిగతా డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపని ప్రజలు

పనులు లేని సమయాల్లో కరువు పనికి వెళ్లగా వచ్చిన డబ్బులతో కుటుంబ ఆవసరాలు తీర్చుకునే వారి సైతం ఎక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లేందుకు పలువురు ప్రజలు ఆసక్తి చూపించడం లేదు. అందుకు కారణం ప్రతి కూలీ వద్ద డబ్బులు వసూలు చేస్తుండటమే. వారానికి రూ.200లు నుంచి రూ.300లు వరకు ఇవ్వాల్సి ఉండగా నెలకు రూ.1000లకు పైగా ఇవ్వాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక కూలీకి రోజుకు రూ.200లు లెక్కనా కూలి డబ్బులు పడినా నెలకు రూ.4800 వరకు అందులో రూ.వెయ్యి రూపాయలకు పైగా అధికారులకు ఇవ్వాల్సి వస్తోందని కూలీలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వారం వారం డబ్బులు ఇచ్చిన వారికి మాత్రం కూలి బాగా పడుతుందని సమాచారం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ చూపి చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

చోరీ కేసులో నిందితురాలు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి

చోరీ కేసులో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నట్లు కనిగిరి డిఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన జి.కుమారి కందుకూరు మండలం విక్కిరాలపేట గ్రామంలో బంధువుల ఇంటికి ఈనెల 12న బయలుదేరింది. బస్సులో తూర్పు గంగవరం నుంచి చీమకుర్తికి అక్కడ నుంచి సంతనూతలపాడుకి అక్కడ నుంచి కొండపి బస్సులో వచ్చారు. కొండపిలో బస్సు ఎక్కుతున్న సమయంలో తన క్రసంచి బరువుగా లేదని చూసుకొనే సరికి సంచి ఒక పక్కన కత్తితో కోసి ఉంది. సంచిలో ఉన్న బంగారు, వెండి, పాస్‌పోర్డు ఉన్న సంచి కనపడకపోవడంతో వెంటనే కొండపి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు వెంటనే ఆర్టీసి డిపోలో ఉన్న బస్సులను తనిఖీ చేశారు. అప్పటికి దొంగ కనపించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సిఐ సోమశేఖర్ ఒక టీంను, ఎస్‌ఐ ప్రేమకుమార్ ఒక టీంను ఏర్పాటు చేశారు. దొంగతనం చేసిన లేడీ దొంగిలించిన బంగారం, వెండిని కందుకూరులో అమ్ముకోవడానికి బస్సులో వస్తున్నట్లు ఇన్‌ఫార్మర్ ద్వారా సోమవారం సమాచారం అందింది. దీంతో పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈమె చీరాల గ్రామానికి చెందిన చవట అంజలి అని తెలిపారు. ఆమె వద్ద నుంచి 165 గ్రాముల బంగారం (సుమారు రూ.15 లక్షలు),120 గ్రాములు వెండి, పాస్‌పోర్డు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ, డిఎస్పీలు అతి తక్కువ సమయంలో చోరీ కేసును చేధించిన సిఐను, ఎస్‌ఐను, పోలీసు సిబ్బందిని అభినందించారు.

ఎస్‌బీఐలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ఎస్‌బీఐలో సోమవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. బ్యాంక్ సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించి విషయాన్ని అగ్ని మాపక కేంద్రానికి చేరవేశారు. అగ్ని మాపక అధికారి హరిబాబు ఆధ్వర్యంలో మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే విద్యుత్ పోల్ నుంచి మీటరు వరకు విద్యుత్ తీగలతో పాటు సోలార్ సిస్టం దగ్ధమైంది. బ్యాంక్ సిబ్బంది అప్రమత్తత వ్యవహరించడంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు.



మినీ మహానాడులో పాల్గొన్న నూకసాని బాలాజీ, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఘనంగా టిడిపి మినీ మహానాడు

ప్రజాశక్తి-దర్శి

దర్శి టిడిపి మినీ మహానాడు సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొని ప్రసంగించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. దర్శిలో జరిగిన మినీ మహానాడు వేదికగా నియోజకవర్గంలోని ఐదు మండల పార్టీ అధ్యక్షులు మరియు దర్శి టౌన్, దొనకొండ టౌన్, కురిచేడు టౌన్ టిడిపి అధ్యక్షులుగా ప్రకాశం జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలు ప్రకటించారు.

నూతన దర్శి నియోజకవర్గ కమిటీ వివరాలు..

మారెళ్ల వెంకటేశ్వర్లు దర్శి మండల టిడిపి అధ్యక్షులుగా, తాళ్లూరు అధ్యక్షులుగా మేడగం వెంకటేశ్వర రెడ్డి, ముండ్లమూరు అధ్యక్షులుగా కూరపాటి శ్రీను, కురిచేడు అధ్యక్షులుగా పిడతల నేమిలయ్య, దొనకొండ అధ్యక్షులుగా మోడీ ఆంజనేయులు, దర్శి టౌన్ అధ్యక్షుడిగా పుల్లలచెరువు సత్యనారాయణ, దొనకొండ అధ్యక్షులుగా షేక్ తోహిద్ అంజూమ్, కురిచేడు టౌన్ అధ్యక్షుడిగా మేడం నాగేశ్వరావులను ప్రకటించారు.

ప్రభుత్వ రంగ సంస్థల పాత్రేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

కోరుతున్నారు. సమాఖ్యకు నిధులు ఇచ్చే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం కనిపించడం లేదు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇదీ జరగడం లేదు. రైతు భరోసా కేంద్రాలూ మూతపడ్డాయి. ధాన్యం కూడా ప్రభుత్వం నుంచి కొనలేదు. మిర్చి రైతులను వదిలేశారు. ఎస్టీసీ కూడా గతంలో పొగాకు కొనుగోలు చేసింది. మార్క్‌ఫెడ్ ద్వారా గతంలో శనగలు కొన్నారు. ఇపుడు ఏ సంస్థ ఏ పంటనూ కొనడం లేదు. పూర్తిగా వ్యాపారులకే వదిలేశారు. ఈ సంస్థలను ఏర్పాటు చేసిన ఉద్దేశం పక్కదారి పట్టింది. వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటారు. అలాంటి సందర్భాల్లో ఈ సంస్థలు రావాలి. రైతులకు భరోసాగా ఉండాలి. వ్యాపారులకు పోటీగా ఉంటే రైతులకు మేలు జరుగుతుంది. ఆ దిశగా పాలకులు ఆలోచించడం లేదు. ఎందుకంటే వ్యాపారులకు లాభాలు తగ్గించే చర్యలు, నష్టం కలిగించే పనులు చేయడానికి వెనుకాడుతున్నారు. ఇక ఎన్నికల్లో చెప్పిన ధరల స్థిరీకరణ నిధి కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. మంత్రివర్గంలో తీర్మానం చేశారు. అయితే నిధి ఏర్పాటు అయ్యిందా? లేదా? అన్నదీ స్పష్టత లేదు. ఏదేమైనా మార్కెట్‌లో జోక్యం చేసుకోవాల్సిన ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అలంకారప్రాయంగానే మిగిలాయి.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ఆర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన "మీ కోసం" కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఆర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజూ లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని. రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ. బి. చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు కుమార్, శ్రీధర్, వరకుమార్, డిప్యూటి కలెక్టరు పార్థసారది. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

అన్నదాతలను ఆదుకునేందుకు రూ.200 కోట్లు ఇవ్వలేరా అంటూ దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి స్వయంగా పరిశీలించారు. పొగాకు రైతుల గిట్టుబాటు ధర విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని వేలం అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పొగాకు రైతులతో మాట్లాడారు. ఏడాది పొగాకు పంట నాణ్యత తగ్గిందని లోగ్రేడ్ పొగాకును తీసుకొస్తున్న రైతులను వెనక్కి తిప్పి పంపుతున్నారని రైతులు వివరించారు. వాతావరణ పరిస్థితులతో పొగాకు పెట్టుబడి బాగా పెరిగిందని, నాణ్యత తగ్గిందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ అప్పట్లో జగన్ ప్రభుత్వం రైతులమీద ప్రేమతో 100 కోట్లు కేటాయించి మార్క్ ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోలు

పొగాకు పరిశీలిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

చేయించారన్నారు. ఈ సంవత్సరం రైతులు ఆందోళన చేస్తున్నా, ఆత్మహత్యలు చేసుకుంటున్నా పొగాకు కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులను గాని, కూటమి ప్రభుత్వం గాని ముందుకు వచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా రైతులు ఒక్క విషయంలో కూడా న్యాయం జరగలేదన్నారు. రైతులెవరు ఆత్మహత్య చేసుకోవద్దని, 2029లో మన ప్రభుత్వ అధికారంలోకి వస్తుందని అందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం చాలా బాధాకరమన్నారు. ఆదివారం ముగ్గురు రైతులు ఒకేసారి ఆత్మహత్య చేసుకోవడం ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు మాజీ డైరెక్టర్ మా రెడ్డి సుబ్బారెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు కసిరెడ్డి వెంకట రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మెట్టు వెంకట రెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జి శ్రీను, గుజ్జుల సంజీవరెడ్డి, కేకేమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్ రెడ్డి, కేకే మెట్ల, కురిచేడు, ముండ్లమూరు జడ్పీటిసిలు అక్కి దాసరి ఏడుకొండలు, నుసుం నాగిరెడ్డి, రత్నం రాజు, దర్శి నియోజకవర్గ రైతు సంఘం నాయకులు బంక నాగిరెడ్డి, కేకేమిట్ల, దొనకొండ, కురిచేడు మండల పార్టీ అధ్యక్షులు మోరా శంకర్ రెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, సుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తోకలవారిపాలెం సర్పంచి టి కృష్ణమోహన్

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

గత వారం రోజులుగా మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీలో నిర్వహించిన సేవి శిక్షణ క్యాంపు సోమవారం ముగిసింది. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ టి కృష్ణమోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు, ఆదర్శ కమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం విద్యార్థులు, యువకులు కృషి చేయాలని అన్నారు. దళితులు, అగ్రవర్ణాలకు కలిపి సహపంక్తి భోజనాలు నిర్వహించిన వ్యక్తని కొనియాడారు. అనేక ప్రజా సమస్యలపై శాసన సభ, పార్లమెంటులోనూ విశేషంగా కృషి చేసిన సుందరయ్య నేటి తరం యువతకు ఆదర్శమని అన్నారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు పరిశుద్ధరావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిర్వహించిన వేసవి క్యాంపులో విద్యార్థులను ఒకే చోట చేర్చి ఆట, పాట, వినోదం, విజ్ఞానం కల్పించడం మంచి పరిణామమని అన్నారు. విద్యార్థులు మంచిగా చదివి తల్లి, దండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బి సుబ్బారావు, పి దివ్య, పంచాయతీ గుమస్తా వి కోటేశ్వరరావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కె నవీన్ పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న విఆర్‌ఒలు

విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలో పనిచేస్తున్న విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ అధికారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు బ్రహ్మయ్యను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఒలు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులను క్లస్టర్ విధానంలో రేషనైజేషన్ పేరుతో గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శిలు ప్రభుత్వం విడుదల చేసిన జీఒ నెంబర్ 4 మార్గదర్శకాలు ఇచ్చారని, ఈ మార్గదర్శకాల వల్ల విఆర్‌ఒలకు నష్టం జరుగుతుందని విమర్శించారు. ప్రస్తుతం పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాలను జనాభా ప్రాతిపదికన తీసుకొచ్చి రెండు సచివాలయాలు కలిపి ఒక క్లస్టర్‌గా నిర్ణయిస్తూ ఒక సచివాలయానికి ఒక విఆర్‌ఓను, మరొక సచివాలయానికి సర్వేయర్‌ను కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ క్లస్టర్ విధానం వల్ల రాష్ట్రంలో 7500 మంది విఆర్‌ఒలు మిగులు సిబ్బందిగా చూపించిగా విఆర్‌ఒలను ఏ శాఖలో సర్దుబాటు చేస్తారని, ఏ ప్రాతిపదికన తాము పనిచేస్తున్న సచివాలయంలో చూపించకుండా సర్వేలను చూపించడానికి కారణమేమిటో చెప్పకుండా నిర్ణయం తీసుకోవడం వల్ల అందరూ ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. జీఒ నెంబర్ 4పై ప్రభుత్వం పునగా ఆలోచించి ఒక సచివాలయానికి ఒక విఆర్‌ఓ ఉండేలా నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే 2019 ముందు వరకు ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో ఒక రెవెన్యూ విలేజ్‌కి ఒక విఆర్‌ఒ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం 2019లో తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థలో రెవెన్యూకు సంబంధంలేని రెవెన్యూ శాఖకు సంబంధించిన విఆర్‌ఒలను గ్రామ వార్డు సచివాలయాల జీఒ నెంబర్ 4 నుండి మినహాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రేమ కుమార్, విఆర్‌ఒ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గంగయ్య

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎన్ రంగారావు

అమర్తలూరులో సిపిఎం జెండా ఆవిష్కరిస్తున్న అగస్టిన్

ప్రజాశక్తి - బాపట్ల

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నేత, అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి మార్గదర్శకమని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా మండలంలోని వెదుళ్ళపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై సుందరయ్య చేసిన అలుపెరగని పోరాటం ఆయనను చరిత్రలో చిరస్థాయిగా నిలిపాయని అన్నారు. 20ఏళ్ళ పాటు పార్లమెంట్, శాసన సభ సభ్యుడిగా ప్రజా ప్రతినిధిగా పనిచేసిన సుందరయ్య నిరాడంబరంగా సైకిల్‌పైనే పార్లమెంటు, అసెంబ్లీకి వెళ్లి ప్రజావాణిని వినిపించారని అన్నారు. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణలో జరిగిన సాయిధ రైతంగా పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య 10లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేయించారని అన్నారు. సిపిఎం అఖిలభారత తొలి ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం నాయకత్వం వహించిన సుందరయ్య కడదాకా సమ సమాజ స్థాపన కోసం ఆహరంహం శ్రమించారన్నారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొని నిలబడి జైలు జీవితాన్ని గడిపారని అన్నారు. సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిపిఎం శ్రేణులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, కె నాగేశ్వరరావు, సాయిబురెడ్డి, కోట వెంకటేశ్వరరెడ్డి, బి తిరుమల, కె శరత్, బి దినేష్ పాల్గొన్నారు.

చీరాల : స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నేత, సిపిఎం వ్యవస్థాపకులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి యువతరానికి ఎంతో ఆదర్శమని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాపనమ్మ కళ్యాణ మండపంలో సిపిఎం సీనియర్ నాయకులు ఐవి ప్రసాదు అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. సుందరయ్య తన పేరు కులాన్ని, మతాన్ని సూచిస్తోందని కులం తోకను తీసేసి సుందరయ్యగా మార్చుకున్న ఆదర్శనీయుడని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఏమి చేస్తే బాగుంటుందోనని వాటన్నిటినీ గ్రంథస్తం చేసిన రచయిత సుందరయ్యని అన్నారు. అలాంటి మహానేత జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి నారపరెడ్డి, సుందర్, రంగారావు, బ్రహ్మం పాల్గొన్నారు.

పంగులూరు : ఉన్న ఆస్తి పార్టీకి అప్పగించి, పార్టీనే తన కుటుంబంగా భావించి, నిస్వార్థంగా జీవితాంతం సేవలందించిన ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యని సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పంగులూరులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుండే ఆదర్శ భావాలు అలవాటు చేసుకుని శ్రమజీవుల కోసం జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. కమ్యూనిస్టు గానే కాకుండా పార్లమెంట్ సభ్యునిగా ఉన్నతమైన ఆదర్శాలను సమాజానికి చూపిన వ్యక్తిని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన సిపిఎం సీనియర్ నాయకులు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ సుందరయ్య చూపిన మార్గం దేశానికి ఆదర్శమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో సిపిఎం పనిచేస్తుందని అన్నారు. నాగాలాండ్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీని దక్షిణ భారతదేశంలో నిర్మించిన వ్యక్తి సుందరయ్యని, ఆయన ఆదర్శాలను నేటి తరం పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుడిపాడు మల్లారెడ్డి, తలపనేని సుబ్బారావు పాల్గొన్నారు.

అమృతలూరు : మండలంలోని యలవర్రు, కూచిపూడి గ్రామాల్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం వేమూరు కార్యదర్శి బి అగస్టిన్ మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య భూస్వామ్య కుటుంభంలో పుట్టినా పేదల కోసం జీవితాంతం నిస్వార్థంగా పని చేసిన మహనీయులని కొనియాడారు. భారత దేశంలో వ్యవసాయ కూలీల కోసం మొట్ట మొదట సంఘం పెట్టిన ఘనత అయనదేనని అన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాత, సిపిఎం నిర్మాతల్లో ఒకరని అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని కోరారు. ముందుగా రిటైర్డ్ పోస్టు మాస్టర్ పి జోనేష్ సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పి రాజు, చావలి రమేష్, కె శ్యాంసన్, జి మేష్ కుమార్ పాల్గొన్నారు.

అద్దంకి : ప్రజా పోరాటాలు, ప్రగతి సాధకులకు నిత్య దార్శనికుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యని సిపిఎం సీనియర్ నాయకులు కె రఘుచంద్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుందరయ్య జీవితం త్యాగాలమయమని అన్నారు. నిరాడంబరతకు, పోరాట పటిమకు ఆయన ఎప్పుడు ఆదర్శనీయుడని అన్నారు. వివక్ష, భూస్వామ్య వ్యవస్థ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం నిర్వహించారని అన్నారు. చట్ట సభలకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా సైకిల్‌పై వెళ్లిన ఆయన నిరాడంబరత అప్పుడు, ఇప్పుడు, ఎప్పటికీ ఆదర్శమేనని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి తన యావదాస్తిని సమాజ ప్రగతికై వినియోగించారని అన్నారు. పార్టీ, ప్రజల కోసం సంతానాన్ని సైతం వద్దనుకున్న త్యాగశీలి సుందరయ్యని అన్నారు. ఆయన జీవితం పేదలు, ప్రజా పోరాటాలు, పార్టీ కోసం త్యాగం చేశారని అన్నారు. నేడు ప్రపంచంలో వస్తున్న యుద్ధాలు, ఆయా దేశ ప్రజల కోసం రావడం లేదని, పాలకులు, పెట్టు బడిదారుల లాభాల కోసం, సామ్రాజ్యవాద ఆదిపత్యం కోసం జరుగుతున్నాయని అన్నారు. మతవాద, మితవాద భావజాలంతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పాలకవర్గం కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మించి ప్రజల ఐక్యతకు కృషి చేయటమే సుందరయ్యకు ఇచ్చే నిజమైన నివాళని అన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో షేర్ కరిం, బి విజయ్ కుమార్, ఆర్ కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆదాం, శరత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు : మండల కేంద్రమైన పర్చూరులోని బొమ్మలు సెంటర్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బొమ్మలు సెంటర్లో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి రోటరీ క్లబ్ సభ్యులు, సిపిఎం నాయకులు పూల మాల సమర్పించి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు సుందరయ్య చేసిన సేవలు కొనియాడారు. ఈ తరం నేతలకు ఆదర్శప్రాయుడని తెలిపారు. సుందరయ్య చూపిన అడుగుజాడల్లో నడుచుకోవాలని కోరారు. అనంతరం తోకల హరిబాబు జ్ఞాపకార్థం బొమ్మల సెంటర్లోని చలివేంద్రం వద్ద మజ్జిగ, పాయసం, గొడుగులు, చెప్పులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, జి శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు పి కొండయ్య, ఎం డేవిడ్, వణుకూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చీరాలలో సుందరయ్య చిత్రపటానికి నివాళులు

అద్దంకిలో మాట్లాడుతూన్న కావూరి రఘుచంద్

పర్చూరులో సుందరయ్య చిత్రపటానికి నివాళులు

21న రేపల్లెలో మినీ మహానాడు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎం రామకృష్ణయ్య

నియోజకవర్గ మినీ మహానాడు 21న బుధవారం నిర్వహిస్తున్నట్లు తెలుగు దేశం మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణయ్య సోమవారం తెలిపారు. రేపల్లెలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో నిర్వహించే మినీ మహానాడుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మినీ మహానాడు ప్రారంభం అవుతుందని అన్నారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు, వివిధ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అమృతలూరు

ఆర్థిక సహాయం చేస్తున్న యువ నాయకులు

మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త శ్రీను ప్రమాదవశాత్తు చెట్టు మీద నుండి పడి నడుముకు దెబ్బ తగిలినది. వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రీనును కూచిపూడి తెలుగు యువత ఆధ్వర్యంలో నాయకులు కలిసి పరామర్శించారు. రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యలవర్తి బ్రహ్మానందం, తుమ్మల భుజంగారావు, మరుపూడి ఆనంద్, యలమంచిలి జగన్మోహనరావు ఉన్నారు.

సుందరయ్య ఉద్యమస్ఫూర్తితో ముందుకు..

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పుచ్చలపల్లి సుందరయ్య ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం కావాలని సిపిఎం నాయకులు తెలిపారు. సుందరయ్య భవన్‌లో మార్కిస్ట్ పార్టీ ఉద్యమ నిర్మాత సుందరయ్య 40వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు అధ్యక్షతన సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ క్యూబా, వియత్నాం విముక్తి పోరాటాలను మించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు వై. సిద్ధయ్య మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో మనుషుల మధ్య వైరుధ్యాలు సష్టిస్తున్న మతోన్మాదులను వర్గ చైతన్యంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ సుందరయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు,చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బి. రఘురామ్, కంకణాల రమాదేవి, సిపిఎం నాయకులు గంటెనపల్లి శ్రీనివాసులు,సిహెచ్. వినోద్,కెఎఫ్. బాబు, టి.మహేష్,జి. నరసయ్య, కంకణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య భవన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను, సిద్ధాంతాలను ఆచరించడమే ఆయనకు అర్పించే నివాళి అని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తెలిపారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య 40 వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీనగర్ లోని భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో, విశాలాంధ్రలో ప్రజారాజ్యం నిర్మించాలని ఆనాడే సుందరయ్య నీటి వనరులు గురించి ,భూములు గురించి ,విద్యా ,వైద్య గురించి ప్రజా ప్రణాళికని రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ నాయకులు సయ్యద్ హుస్సేన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసరావు, నాయకులు దామా శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు కొర్నెపాటి శ్రీనివాసరావు, ధారా వెంకటేశ్వర్లు ,జి.ఆదిలక్ష్మి , టి.మహేష్ పాల్గొన్నారు .

కొప్పోలులో..

నగర పరిధిలోని కొప్పోలు గ్రామంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పోలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జెండాను స్థానిక నాయకుడు బొడపాటి రాఘవరావు ఆవిష్కరించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోడెల కోటయ్య, హనుమంతరావు, ఆదినారాయణ, ముచ్చు వెంకట్రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో,,,

ఏడుగుండ్లపాడులోని ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తి : పుచ్చలపల్లి సుందరయ్య నేటి తరానికి ఆదర్శమని సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు పేర్కొన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి చీమకుర్తి మరియు కెవి.పాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు పొత్తూరి సురేష్, బెజవాడ శ్రీనివాసరావు, నల్లూరి కష్ణయ్య ,కొల్లూరి వెంకటేశ్వర్లు, రామారావు, చిన్నపురెడ్డి, పమిడి రామారావు, ఓబుల్ రెడ్డి, టిడిపి నాయకులు పుట్ట బ్రహ్మయ్య, గోరంట్ల ప్రసాద్, పాలడుగు వెంకటనారాయణ, పుట్టా శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు డి సుధాకర్, నరసింగరావు, పమిడి కపావతి, బెజవాడ పద్మ, పోకూరి రమాదేవి, కొల్లూరి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు : సిపిఎం టంగుటూరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిబాబు సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ హరిబాబు మాటాడుతూ సుందరయ్య జీవితం ఆదర్శ వంతమైనదని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, టి.రాము, వి.మోజెస్, టి.సుబ్బారావు, టి.నారాయణరావు, టి. రామ్మూర్తి, ఎం. యానాది, బుడే సాహెబ్,ఎస్‌కె.శ్రీను, పి.శ్రీనివాస్, అంకయ్య, తిరుమలరావు, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిపాడు, లింగంగుంట, గుళ్ళాపల్లి, దొడ్డవరం గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించారు. మద్దిపాడు కళామందిరం దగ్గర సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు మాట్లాడుతూ నేటి యువత సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉబ్బా వెంకటేశ్వర్లు, కాకుమాను సుబ్బారావు, గంగిశెట్టి నరసింహారావు, యలమంద, కటకం వెంకటేశ్వర్లు,కలాం ,రామారావు, ధనలక్ష్మి, విమల, లక్ష్మి నారాయణ, వెంకట్రామిరెడ్డి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నగరకమిటీ నాయకులు

మద్దిపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 741 పొగాకు బేళ్లను సోమవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 607 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 134 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ. 205, సరాసరి ధర రూ.246-45 పైసలు పలికింది. పొగాకు వేలం లో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొండపి : కొండపి పొగాకు కేలం కేంద్రానికి కస్టర్ పరిధిలోని అనకర్లపూడి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 800 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. అందులో 573 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 227 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280,సరాసరి ధర రూ. 241.68 పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికి సునీల్ కముఆర్ తెలిపారు. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు, అనకర్లపూడి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

శైలజ చర్మవ్యాధుల హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

శైలజ చర్మవ్యాధుల హాస్పిటల్ నూతన భవనాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సోమవారం ప్రారంభించారు. డాక్టర్ శైలజ పర్యవేక్షణలో గత పది సంవత్సరాలుగా లంబాడి డొంకలో నిర్వహిస్తున్న శైలజ చర్మవ్యాధుల హాస్పిటల్ నూతన భవనాన్ని జిల్లా ఎస్‌పి కార్యాలయం ఎదుట సేవిత నరసింహం పక్కన నిర్మించారు. ఈ భవనంలో చర్మవ్యాధులు సంబంధించి అధినాతన పరికరాలతో రోగులకు అందుబాటులో అన్ని సౌకర్యాలను హాస్పిటల్ యాజమాన్యం నిర్వాహకులు డాక్టర్ శైలజ, డాక్టర్ ఆర్.శ్రీకాంత్ ఏర్పాటు చేశారు. నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో రోగులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచడం అభినందినీయమన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ రాష్ట్ర చైర్మన్ రియాజ్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ జి.ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్ కాపా, డాక్టర్ ఎ. శ్రీనివాసరావు, సాయి శశిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కిరణ్మయి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దీరేందర్, డాక్టర్ చైతన్య కష్ణ జూన్ 5న నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సహాధ్యక్షులు సయ్యద్ మసూద్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, రాయితీలు 12వ పిఆర్‌సి గురించి చర్చించనున్నట్లు తెలిపారు. ఒంగోలు తాలూకా పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు తాలూకా వైస్ ప్రెసిడెంట్ ఆర్.సుభాకర్, సభ్యులు మహేంద్ర, రాజమ్మ, విజయమ్మ, సునీత, పద్మ, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఖాళీ స్థలాలకు లీజు వేలం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఎపిపిటిడి జోన్-3, నెల్లూరు పరిధిలోని వివిధ బస్ స్టేషన్ / బస్ డిపోల్లో ఖాళీగా ఉన్న 26 ఓపెన్ ప్రదేశాలను 15 సంవత్సరాలకు లీజు పద్ధతిలో ఇచ్చేందుకు బిడ్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ జి.సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 28 వరకూ అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు దారులు తమ అప్లికేషను మే 29. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల లోపు జోన్-3, ఇడి ఆఫీస్, నెల్లూరు వారి కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 03.00 గంటలకు బిడ్స్ టెండరు దారుల సమక్షంలో తెరుస్తారని చెప్పారు. కనిగిరి బస్ స్టాండ్ (బిట్-2),పామూరు బస్ స్టాండ్ (బిట్-1)పామూరు బస్ స్టాండ్ (బిట్-2)లో స్థలాలు లీజుకు తీసుకోనేవారి కోసం మే 22న ఉదయం గం. 11.00 కు ఒంగోలు ఆర్‌టిసి బస్టాండ్‌లోని డిపిటిఒ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-టంగుటూరు : పచ్చి రొట్ట ఎరువు విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు ఎఒ స్వర్ణలత తెలిపారు. అదేవిధంగా నువ్వు విత్తనాలు 40 శాతం రాయితీపై అందజేయన్నుట్లు ఎఒ తెలిపారు. పచిరొట్ట, నువ్వు విత్తనాలు కావలసిన రైతులు గ్రామంలోని వ్యవసాయ శాఖ సహాయకులను కలిసి తమ పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లించాలని ఎఒ స్వర్ణలత తెలిపారు.

అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో 2006-2008 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు గోపి కష్ణారెడ్డి, వెంకారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అధ్యాపకులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

వైభవంగా 'మహా కుంభాభిషేకం'

- హాజరైన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డిబివి స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఇంటూరి నాగేశ్వరరావు

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు గొట్టిపాటి, స్వామి

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. గత ఆరు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మహా కలశ పాదయాత్ర మహిళా భక్తులు ప్రారంభించారు. గుండ్లకమ్మ నది నుండి 7 కిలోమీటర్లపైగా మహిళా భక్తులు కాలినడకన సింగరకొండకు చేరుకున్నారు. కళశ శోభాయాత్రకు మహిళా భక్తులు వేకువ జామునే గుండ్లకమ్మకు చేరుకున్నారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఉదయం 8గంటల నుండి శృంగేరి పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి చేతుల మీదుగా స్వామివారికి ప్రత్యేక కుంబాభిషేకం జరిపారు. దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుండి ముఖ మండప నిర్మాణం జరిగిందని, అంచెలంచెలుగా ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో సింగరకొండకు మరింత పేరు తెచ్చే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు ఉంటాయని ఆయన అన్నారు. శ్రవణా నక్షత్ర యుక్త మిధున లగ్నమున శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి నూతన విమాన శిఖర జీవద్వజ ప్రతిష్టా మహాకుంభాభిషేక మహోత్సవాలు దాతలు, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డివిబి స్వామి, శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్, ఇంటూరి నాగేశ్వరరావు, ఇఒ మదమంచి తిమ్మనాయుడు, దాతలు మేదరమెట్ల శంకరారెడ్డి పాల్గొన్నారు.

వర్షపు చిరుజల్లులు పడుతున్నప్పటికీ భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్‌లో బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా దాతలు క్యూ లైన్లో మజ్జిగ, తాగునీరు మహిళా వాలంటీర్లు అందిస్తూనే ఉన్నారు. గంటలు తరబడి క్యూ లైన్లోనే కొనసాగి భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహా కుంభాభిషేకం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు రావడంతో ప్రత్యేకంగా కేరళ, ఇతర ప్రాంతాల నుండి డప్పు వాయిద్యాలు, కోయ సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతనో అలరించాయి.

భక్తులకు అన్నదానం

మహా కుంభాభిషేకం సందర్భంగా గత ఆరు రోజుల నుండి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు లక్షల మంది భక్తులు రావడంతో దేవస్థానం ఆధ్వర్యంలో, వివిధ సామాజిక అన్నదాన సత్రాల్లో అన్నదానం ఘనంగా నిర్వహించారు. మహాకుంభాభిషేకానికి కొద్ది గంటల ముందే చిరుజల్లులు స్వాగతం పలకగా గుండ్లకమ్మ నది నుండి మహిళా భక్తులు కలశ పాదయాత్ర సింగరకొండవైపు కొనసాగింది. చిరుజల్లుల్లోనే తడుస్తూ దేవస్థానం వరకు మహిళలు చేరుకున్నారు. నదీ జలాలను ప్రత్యేకంగా ఉంచి స్వామివారికి అభిషేకం చేశారు.

ఉత్సవాలకు హాజరైన మంత్రులు, ఎంఎల్‌ఎలు

వేదికపై ఎంఎల్‌ఏ నరేంద్రవర్మ, నాయకులు

ఘనంగా నియోజకవర్గ మహానాడు

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గ మహానాడు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఇటీవల మరణించిన తెలుగుదేశం నాయకులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం బలం, బలగం కార్యకర్తలే అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం అను నిత్యం పాటు పడుతున్నది తెలుగుదేశం అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం కష్టపడిన ప్రతీ ఒక్కరికి పదవుల్లో సముచిత స్థానం కలిపిస్తామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో కలిసి ముందు వెళ్లి ఘన విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, భావుడా చెర్మన్ సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర కార్యానిర్వహణ కార్యదర్శి తాతా జయప్రకాశ్ నారాయణ, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబిరెడ్డి, వివిధ స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మహానాడును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే టీడీపీ మహానాడు జయప్రదం చేయాలని శాసన సభ్యులు నక్క ఆనందబాబు కోరారు. స్థానిక ఎన్టీఆర్ పుర వేదిక వద్ద సోమవారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే మహానాడులో రెండు రోజులు ప్రతినిధుల మహాసభ ఉంటుందని, తదనంతరం జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య, వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, తునుగుంట్ల సాయిబాబా, కనకాల మధుసూదన ప్రసాద్, మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్న ఎఒ భారతి

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడి

ప్రజాశక్తి - చీరాల

రైతులు ప్రకృతి సేద్యం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ కావూరి రమణారెడ్డి అన్నారు. మండలంలోని తోటవారిపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూన్న మహిళ రైతు స్వరూప భూసారం పెంచేందుకు పిఎండిఎస్ విధానం ద్వారా 18రకాల చిరుధాన్యాల విత్తనాలు, బీజామృతం ద్వారా శుద్ధిచేస్తుంది. పొలంలో విత్తనాలు చల్లగా ఈ విత్తనాలు కొంతమేర పెరిగాక భూమిలో కలియదున్నాలని, వర్షాలు పడుతున్నాయి కాబట్టి చల్లుటకు అనువైన సమయమని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ డివిజన్ అధికారి భారతి, గండూరి వెంకటరావు, ప్రకృతి వ్యవసాయం ఐసిఆర్‌పిలో కవిత, స్వరూప, పావని, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టలో మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని నాగండ్ల గ్రామంలో గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి ప్రతిష్టకు హాజరైన మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసన సభ్యులు ఏలూరి సాంబ శివరావుకు ఆలయ కమిటీ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పురాతన మల్లేశ్వర స్వామి ఆలయం దెబ్బతినడంతో గ్రామస్తులు రూ.2కోట్లకుపైగా విరాళాలు సేకరించి ఆలయపున నిర్మాణం గత మూడేళ్ల నుంచి పనులు చేయించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన వంతుగా రూ.25లక్షల పైన విలువగల గ్రానైటు అందించారు. దేవాదాయ శాఖ రూ.45లక్షలు నిర్మాణానికి మంజూరు చేసింది. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పునర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అద్దంకి మాజీ శాసన సభ్యులు బాచిన చెంచు గరటయ్య, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కట్ట గుండయ్య, ఎర్రమాసు హరిబాబు, చెరుకూరి బ్రహ్మయ్య ఏర్పాట్లను పరిశీలించారు. నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట తోపాటు ఆలయ ప్రాకార శిఖరంపై కలశాలను ప్రతిష్టించారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఏలూరి

ప్రారంభమైన ఎపి ఇఎపి సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎపి ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపి ఇఎపి సెట్ 2025) పరీక్షలు సోమవారం నుండి నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఎపి ఉన్నత, సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్షలు ఈనెల 19 నుండి 27వరకు కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసిలో చేరబోయే అభరులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కాకినాడ జెఎన్‌టియుచే నియమించ బడిన పరిశీలకుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థుల తల్లి, తండ్రులు, సంరక్షులకు మంచినీటి సదుపాయం, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మెదటి షిఫ్టులో 176 మందికి 164 మంది, సాయంత్రం షిఫ్టులో 176 మందికి 164 మంది మొత్తం 352 మందికి 328 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.

కౌలురైతు గుర్తింపు కార్డులతో ఉపయోగం

ప్రజాశక్తి - నగరం

మండల పరిధిలోని ఈదుపల్లి సచివాలయంలో డిప్యూటి తహశీల్దారు ఎన్ సత్యనారాయణ అధ్యక్షతన పంట సాగుదారుల హక్కు పత్రంలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఎఒ వి రమేష్ బాబు మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డు పొందటం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు పొందే అవకాశం ఉంటుందని, అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా, పంట నష్ట పరిహారం, పండించిన పంట అమ్ముకోవడానికి, పంట రుణాలు పొందటానికి కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. ఎఇఒ కె నాగ శ్రీనివాసరావు, విఎఎ ఎన్ కిరణ్మయి, విఆర్‌ఒ ఎస్‌కె జెబిరుల్లా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నగరం ఎఒ వి రవిబాబు

పర్చూరు : మండలంలో సాగు చేసే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ప్రభుత్వ మంజూరు చేస్తుందని విఆర్‌ఒ శ్రీనివాసరావు తెలిపారు. తహశీల్దారు కార్యాల ఆవరణలో సదస్సు నిర్వహించారు. సర్పంచ్ మల్ల అంజమ్మ, విఆర్‌ఒలు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి - వేటపాలెం

మాట్లాడుతున్న రాఘవ

మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీలో విద్యుత్ సమస్యలపై చీరాల వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు వైసిపి బీసీ సెల్ అధ్యక్షులు సాదు రాఘవ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం నందు జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ పందిళ్ళపల్లి పంచాయతీలో విద్యుత్ సబ్ స్టేషన్ నందు విద్యుత్ సరఫరా ఒక ఫేస్ రిపేర్ అయ్యి దాదాపుగా ఎనిమిది నెలలు అయినప్పటికీ మరమ్మత్తులు చేయకుండా అప్పటి నుండి రామన్నపేట సబ్‌స్టేషన్ నుంచి తాత్కాలికంగా సరఫరా చేస్తున్నారని అన్నారు. దీనివలన గ్రామంలో లో ఓల్టేజ్ సమస్యతో గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నిరంతరం పందిళ్ళపల్లి ప్రజలు కరెంటు కోతలతో బాగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను ప్రజలు ఎన్నోసార్లుపై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాలేదని తెలిపారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో కలిసి అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల గుర్తింపు

ప్రజాశక్తి - సంతమాగులూరు

సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు మండలంలో 18ఏళ్లలోపు విభిన్న ప్రతిభావంతులను గుర్తించే కార్యక్రమం ఈనెల 13 నుండి జూన్ 9వరకు జరుగుతుందని ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు, దినేష్ కుమార్ తెలిపారు. భవితా సెంటర్ ద్వారా రవాణా బత్యం, చికిత్సలు సమగ్ర శిక్ష ద్వారా అందించనున్నట్లు తెలిపారు. గతేడాది రూ.1.90 లక్షల విలువైన ఉపకార వేతనాలు తల్లి, దండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు ఐదుగురు విభిన్న ప్రతిభావంతులు హాజరు కాగా వీరిలో నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని అన్నారు.

చేనేత కార్మికులతో మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

చేనేతలను ఆదుకోవడంలో విఫలం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

చేనేతలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టెం శ్రీనివాసరావు, వంగర భాను ప్రసాద్, కందుల సురేష్, సూర్యనారాయణ, శొంటి సురేష్, సర్పంచ్ ఏమినేని సుబ్బారావు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నాటు సారా తయారీ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ జె వెంకట మురళి అధికారులకు తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో ఆయన సమావేశం సోమవారం నిర్వహించారు. నాటు సారా రహిత జిల్లాగా తయారు చేయడానికి లైన్ డిపార్ట్మెంట్ అధికారులందరూ కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 అనే కార్యక్రమాన్ని తలపెట్టిందన్నారు. జిల్లాలో నాటు సారా నిర్మూలనపై ప్రొబిషన్, ఎక్సైజ్ అధికారులను ఆయన ఆరా తీశారు. నవోదయం 2.0 అమలుపై తీసుకున్న చర్యలను కలెక్టర్‌కు ఎక్సైజ్ అధికారులు వివరించారు. బాపట్ల, చీరాల, స్టువర్టుపురంలో ఎస్‌టి వర్గానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నందున, అక్కడకు తనిఖీలకు వెళ్ళిన సమయంలో వారు ఎస్‌టి యాక్ట్ ద్వారా కేసులు పెడతామని బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. నాటు సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. గ్రామాల్లో లైన్ డిపార్ట్మెంట్ల సహకారంతో గ్రామ సభల

ప్రమాణ పత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

ద్వారా, కళాజాతాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, ప్రచార రథాలు, కరపత్రాల ద్వారా ఇంటింటా ప్రచారం చేయాలని అన్నారు. నాటు సారా తయారీ, అమ్మకాలు, రవాణా విషయంలో మూడు విభాగాలకు సంబంధించి 16 గ్రామాలు సమస్యాత్మకంగా ఉన్నాయని ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాబోవు 15 రోజుల్లో జిల్లాలో నాటు సారా తయారు చేసే సమస్యాత్మకమైన 16 గ్రామాల్లో విఆర్ఓ, పంచాయతీ సెక్రెటరీ, పోలీస్ సిబ్బందితో దాడులు నిర్వహించాలని అన్నారు. ప్రజలకు నాటు సారా తయారీ ద్వారా కలిగే నష్టాలు, జరిమానాలు వివరించి భయం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నాటు సారా తయారీ మానుకుంటే జీవనోపాధులు మెరుగుపరచడానికి బ్యాంకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా మత్తు టాబ్లెట్లు, చాక్లెట్లు, లిక్విడ్ గంజాయి కనపడడానికి వీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో ఏ స్థాయి అధికారి జోక్యం చేసుకున్నా వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎవరైనా బెదిరింపు చర్యలకు పాల్పడితే వారిపై పిడి యాక్ట్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డి అడిక్షన్ సెంటర్లను తనిఖీ చేయాలని డిఆర్ఓ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. రెడ్ క్రాస్ వారు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, పిడి డిఆర్‌డిఎ శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ విజయమ్మ, డిఇఒ పురుషోత్తం, బాపట్ల ఆర్‌డిఒ పి గ్లోరియ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ బట్టు పాల్గొన్నారు.

జ్యోతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అశోక్ బాబు

అశోక్ బాబు పరామర్శ

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కోగంటి లవ కుమార్ కుటుంబ సభ్యులను వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు దంపతులు సోమవారం పరామర్శించారు. ఇటీవల లవ కుమార్ సతీమణి జ్యోతి అకాల మరణం చెందారు. అశోక్ బాబు దంపతులు లవ కుమార్ నివాసంలో జ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోగంటి జ్యోతి భౌతికంగా దూరమైనప్పటికీ తమతో అనుబంధం మరువురానిదని అశోక్ బాబు దంపతులు అన్నారు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఎంపీటీసీ కౌతరపు పద్మావతి భర్త లోకనాథం మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వేంకటేశ్వరుని దర్శించుకున్న శివప్రసాద్

ఆలయానికి త్రీఫేస్ విద్యుత్ ఇవ్వాలి

ప్రజాశక్తి - నగరం

మండల కేంద్రంలోని శ్రీగిరిపురం నందు వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు శివప్రసాద్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. తీర ప్రాంతంలో ఉన్న దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ శ్రీవారి భక్తులకు అందుబాటులో ఉండటం సంతోషమని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ కుమార్ మాట్లాడుతూ ఆలయానికి త్రీఫేస్ లేకపోవడంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. వివాహాలు, ఇతర కార్యక్రమాల సందర్భంలో విద్యుత్ అలంకరణలకు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆలయానికి త్రీఫేస్ కరెంటు ఇప్పించాలని కోరారు. వివాహాలు చేసుకుంటున్న సమయంలో విద్యుత్ చాలకపోవటంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలపై ఆడిట్ నిర్వహించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీలపై ఆడిట్ నిర్వహించాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన సోమవారం వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 170 దరఖాస్తులు నమోదయ్యాయి. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. వాటికి అక్కడికక్కడే ఆయన పరిష్కార మార్గం చూపారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కొన్నిటిని క్షేత్రస్థాయి పరిశీలనకు, మరికొన్నింటిని విచారించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి అర్జీని అధికారులు నిశితంగా పరిశీలించి, పరిష్కరించాలని చెప్పారు. పరిష్కారమైన అర్జీకి సంబంధించిన సదరు

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

ఫిర్యాదుదారుడి ఇంటి వద్దకు వెళ్లి ఫోటో అప్ లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఎపిఎఫ్ఆర్ఎస్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆన్‌లైన్ హాజరు వేయాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, డిఆర్డిఎ పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

బాపట్లలో ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సాచివేత ధోరణి అనుసరిస్తుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ చాంద్ భాషా అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ అధ్యక్షత వహించారు. చాంద్ భాష మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన విధా విధానాలను అవలంబిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం 117 జిఒ ద్వారా ఆరు రకాల పాఠశాలలుగా విభజించి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పోయే విధంగా వ్యవహరించిందని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం 9 రకాల పాఠశాలలుగా విభజించి గత ప్రభుత్వం చేసిన విధానాల్ని అనుసరిస్తూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించడానికి పూనుకున్నదని అన్నారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని అన్నారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి 1:45 చేయడం వల్ల మిగులుగా చూపించిన సబ్జెక్టు టీచర్లు అందరూ ఉన్నత పాఠశాల్లో సర్దుబాటు అవుతారని అన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి జంపని శ్రీనివాసరావు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న గుంటూరు డిఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే 23న రాష్ట్ర విద్యా శాఖ కార్యాలయ ముట్టడి చేస్తామని అన్నారు. విజయబాబు, సురేష్, సుభాని, బి నాగరాజు, నారాయణ, పివి నాగరాజు పాల్గొన్నారు.

చీరాల : ఈ నెల 21న పాత జిల్లా కేంద్రాల్లో డిఈఓ కార్యలయాల ముట్టడి జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి యుటిఎఫ్, ఎపిటిఎఫ్ (257), ఎపిటిఎఫ్ (1938), హెచ్ఎం అసోసియేషన్, ఎపి టీచర్స్ గిల్డ్ ప్రతినిధులు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బండి బిక్షాలు బాబు, ఎపిటిఎఫ్ (257) సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఎపి టిఎఫ్ (1938) డి నారాయణ, గుమ్మ శ్రీనివాసులు, ఎస్టీయూ తరపున జి ఏసురత్నం, జెవివి కార్యదర్శి కుర్రా రామారావు, పాలేటి సురేష్, కుర్ర శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసులు, అంకిరెడ్డి, శ్రీను, హుస్సేన్ సాహెబ్, సిహెచ్ నాగేశ్వరరావు, వేణుబాబు, జీవన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

చీరాల ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ నాయకులు

గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని సజ్జాపురం గ్రామ సమీపంలోని తిరుమల సాయి చంద్ర గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలు అయ్యాయి. ఆదివారం రాత్రి సమయంలో తిరుమల సాయి చంద్ర గ్రానైట్ క్వారీ వద్ద ఐదుగురు కార్మికులు ట్రాక్టర్‌లో కొండపైకి తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఇలుమలై నాగరాజ్ (44) ట్రాక్టర్ నడుపుతుండగా అదుపుదప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న నాగరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ట్రాక్టర్‌లో ఉన్న నలుగురు కార్మికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై నాగరాజ్ కుమారుడు ఇలుమలై అజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం పట్టాభిరామయ్య తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి

రేపు జిల్లా అభివృద్ధి సమీక్ష

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె వెంకట మురళి సోమవారం తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై పూర్తి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు చెరుకుపల్లి, గుళ్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 93మంది విద్యార్థులకు గాను, 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. 58 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ పులి లాజర్ తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఆర్ శోభాచంద్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజాసమస్యలు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

గడువులోపు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నిర్ణీత గడువులోగా అర్జీ దారుల సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. అర్జీదారులు వారి సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ, ఆస్థి వివాదాలు, ఇతర సమస్యలపై వచ్చిన 50అర్జీలను ఎస్పీ పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని తెలిపారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్పీ టిపి విఠలేశ్వర్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మనోజ్‌కుమార్

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని తూర్పు నాయుడు పాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ కొండపి నియోజక వర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత, గౌరవం, జరిగిన పనులు, జరగాల్సిన పనులు గురించి మంత్రితో చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శింగరాయకొండ మండల అధ్యక్షుడు ఐయినాబత్తిని రాజేష్, జరుగుమల్లి మండల అధ్యక్షుడు గూడా శశిభూషణ్, నాయకులు కాసుల శ్రీనివాసులు, దారం పవన్ కుమార్, మెండా మహేంద్ర బాబు పాల్గొన్నారు.

మంత్రి స్వామితో మాట్లాడుతున్న మనోజ్ కుమార్

ప్రభుత్వ స్థల ఆక్రమణ అడ్డగింత

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

కమ్యూనిటీ హాలుకు కేటాయించిన ప్రభుత్వ స్థల ఆక్రమణను స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. అందిన వివరాల ప్రకారం... ఒంగోలు నగర పరిధిలోని 35వ వార్డు పాతసుజాత నగర్ విఐపి రోడ్డు 1-2 లైన్ల మధ్య సర్వే నెంబర్ 279/1బిలో 30 గదుల స్థలాన్ని కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం గతంలో కేటాయించారు. అది కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలంగా అందులో అధికారులు బోర్డు కూడా ఏర్పాటు చేశారు.అయితే ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు నాలుగు రోజుల క్రితం ఆ స్థలంలోని బోర్డు తొలగించాడు. సోమవారం బోరు వేసేందుకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు బోరు పనులను అడ్డుకున్నారు. ఆ స్థలం తనకు కేటాయించారని, కోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని ఆక్రమణ దారుడు బుకాయించాడు. విషయం తెలుసుకున్న సిపిఎం నగర నాయకులు దామా శ్రీనివాసులు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులకు సమాచారం అందించాడు. సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అది ప్రభుత్వ స్థలంగా అందులో బోర్డు ఏర్పాటు చేశారు. కోర్టు ఉత్తర్వులు చూపించాలని ప్రశ్నించడంతో ఆక్రమణదారుడు అక్కడ నుంచి ఉడాయించాడు.

ఆక్రమిత స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి : సిపిఎం

ప్రజా అవసరాలకు(కమ్యూనిటీ హాలు) కోసం గతంలో కేటాయించిన విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నాయకుడు దామా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆ స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలన్నారు. అందులో పార్క్ ఏర్పాటు చేసి వసతులు కల్పించడానికి కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

కొండపిలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-కొండపి

ఆపరేషన్ సిందూర్‌ను విజయ వంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు శ్రద్ధాంజలి అర్పిస్తూ కొండపిలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి,మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ర్యాలీని తహశీల్దారు కార్యాలయం వద్ద నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా కామేపల్లి రోడ్డులోని శ్రీ సాయి సీతారామకళ్యాణ మండపం వరకూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జి.రామయ్యచౌదరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ పాల్గొన్న మంత్రి స్వామి, దామచర్ల సత్య

వర్షపు నీటితో అవస్థలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులో సోమవారం ఓ మాదిరి వర్షం కురిసింది. దీంతో టంగుటూరు నుంచి కొండపి వెళ్లే రహదారిపై నీరుచేరింది. ఫలితంగా రాకపోకలకు అంతరాయం కలిగింది. టంగుటూరు లోని సార్ట్స్ కార్యాలయం వద్ద నుంచి పై ఓవర్ బ్రిడ్జి వరకూ రహదారిపై అడుగు నుంచి రెండు అడుగుల లోతున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, లారీలు మరమ్మతులకు గురవు తున్నాయి. గుంతలు లేని రోడ్లే లక్ష్యమంటున్న కూటమి ప్రభుత్వం మాటలతో కాల యాపన చేస్తుందని ప్రజలు ఆరో పిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రహదారిపై చేరిన వర్షపు నీరు

కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది

మంత్రి డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-కొండపి

అభివృద్ధి, సంక్షేమం పార్టీకి రెండు కళ్ల లాంటివని, కార్యకర్తలే టిడిపికి బలమైన పునాదులని, కార్యకర్తల త్యాగాలు వెలకట్టలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. స్థానిక శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో కొండపి నియోజకవర్గ మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి కార్యకర్తల సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో కొండపి నియోజకవర్గంలోని 41మంది టిడిపి కార్యకర్తలపై మోపిన అక్రమ కేసులను ఎత్తి వేసినట్లు తెలిపారు. రామతీర్థం నుంచి కొండపి నియోజకవర్గానికి తాగునీటి పథకం కోసం రూ.450 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో ప్రతి పంచాయతీలోని వ్యవసాయ పొలాలకు డొంక రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మినీ మహానాడు నియోజకవర్గ పరిశీలకులు మదిశెట్టి వెంకటేశ్వర్లు, స్వాములు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జి.రామయ్యచౌదరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

పోరాటాల గడ్డ కనిగిరి : బాలాజీ

కనిగిరి : పోరాటాల గడ్డ కనిగిరి అని టిడిపి జిల్లా అధ్యక్షుడు, టూరిజం బోర్డు ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. సానిక మూలే బాలిరెడ్డి ఫంక్షన్ హాల్ టిడిపి మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. తొలుత టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఇతర నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా ఇటీవల పహల్గాం దాడుల్లో మృతి చెందిన పర్యాటకులు, మరణించిన టిడిపి కార్యకర్తలకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నూకసాని బాలాజీ మాట్లాడుతూ కనిగిరిలో ఉగ్రనరసింహారెడ్డి ఏ కార్యక్రమం చేపట్టినా ప్రత్యేకత చూపి ముందంజలో నిలుపు తారన్నారు. ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీలో న్యాయం జరుగు తుందన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత కనిగిరి నియోజకవర్గ అభివృద్ధిలో వేగం పెరిగిందన్నారు. అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి కృషి కొనసాగుతుందన్నారు. ట్రిపుల్‌ఐటి కళాశాల ఒంగోలుకు తరలిపోతుందని ప్రచారం జరిగిందని, కనిగిరిలో ట్రిపుల్ ఐటి కళాశాల ఏర్పాటు చేయకపోతే తాను పోటీ చేయనని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల అమ్మన్రబ్రోలుకు వచ్చిన యువ నేత నారా లోకేష్ బాబు కనిగిరిలోని బల్లిపల్లిలోనే ట్రిపుల్ ఐటి కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం డిసిఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఎఎంసి ఛైర్మన్ ఛైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, మత్స్యకార సొసైటీ ఛైర్మన్ తోడేటి గోపిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, యూత్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, టిడిపి మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, నాయకులు గుడిపాటి ఖాదర్, రావమల్ల శ్రీనివాసుల రెడ్డి, పచ్చవ వెంకటేశ్వర్లు, మచ్చుమారి చెంచిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

21న డిఇఒ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-టంగుటూరు : ఈనెల 21న డిఇఒ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకయ్య కోరారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ విద్యారంగ సంస్కరణలపేరుతో అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీన పరచడాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యా సంఘాల ఐక్య వేదిక కొండపి నియోజకవర్గ స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ 257 జిల్లా ఉపాధ్యక్షుడు పి. హనుమంతరావు, ఎపిటిఎఫ్ 257 రాష్ట్ర కౌన్సిలర్ కె.రవి, ఎపిటిఎఫ్ 1938 కొండపి మండల ప్రధాన కార్యదర్శి పి.సీతారామయ్య, యుఎస్‌టియు జిల్లా కార్యదర్శి జి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న సిహెచ్‌ఒలు

కొనసాగుతున్న సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)ల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. 21వరోజు సోమవారం వర్షంలోనూ సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఎపిఎంసిఎ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ న్యాయమైన హక్కులు, డిమాండ్ల కోసమే పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వారు గొంతెమ్మ కోరికలు కోరట్లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీకాంత్, శైలజ ,రామేష్, బాబూరావు, ఖాదర్‌వలి ,అశోక్,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో తహశీల్దారు పర్యటన

ప్రజాశక్తి మద్దిపాడు

గుండ్లకమ్మ పరివాహక ప్రాంతాలలో తహశీల్దారు నారాయణరెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మల్లవరం, కొలచనకోట, వెల్లంపల్లి, మద్దిపాడు, కీర్తిపాడు గ్రామాలలో ఇసుక తరలిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. అక్రమంగా ఇసుక తవ్వినా, రవాణా చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు ఈ సందర్భంగా హెచ్చరించారు. తహశీల్దారు వెంట ఎస్ఐ శివరామయ్య, ఆర్ఐ